క్లుప్తంగా

15 మంది జూదరుల అరెస్టు

పొన్నలూరు: మండలంలోని ముప్పాళ్ల, చెన్నిపాడు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 15 మంది జూదరులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ముప్పాళ్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనుక్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అదుపులోనికి తీసుకొని వారి దగ్గర నుంచి రూ.2,220 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చెన్నిపాడులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి దగ్గర నుంచి రూ.37,610 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

5న సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి వచ్చే నెల 5న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ ఖాదర్‌బీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగే సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

వ్యవసాయాధికారిగా ప్రకాష్‌రావు బాధ్యతలు స్వీకరణ


ప్రకాష్‌రావు

పీసీపల్లి: మండల వ్యవసాయాధికారిగా కె.ప్రకాష్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటస్వామి అనారోగ్యంతో మెడికల్ లీవ్‌లో ఉండగా నూతన వ్యవసాయాధికారిగా ప్రకాష్‌రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నేరేడువల్లి, మురుగమ్మి గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించి రైతులకు సూచనలు చేశారు.

వ్యవసాయాధికారిగా సంపత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

సీఎస్‌పురం(పామూరు): మండల వ్యవసాయాధికారిగా బి.సంపత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని రాచర్ల మండలం వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై సీఎస్‌పురం మండల వ్యవసాయాధికారిగా వచ్చారు. ఇంతవరకు పామూరు ఏఓ రాధ సీఎస్‌పురం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు

పొన్నలూరు: గ్రామాల్లోని కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ పుల్లారావు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం డీలర్లకు, ఎండీయూలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ మొదలైన మొదటి వారంలోనే పంపిణీ శాతం ఎక్కువగా పెంచాలన్నారు. రోజుకూ 200 కార్డులకు తగ్గకుండా ప్రతి నెల 80 శాతంపైన పంపిణీ ఉండేలా చూడాలన్నారు. రేషన్ పంపిణీ ముగిసిన వెంటనే రిటర్న్ స్టాక్ నమోదు చేయాలన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ నరసయ్య, డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

2 దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు

కొండపి: మండలంలో దీపావళి మందులు విక్రయించేందుకు రెండు దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్ మంజూరైనట్లు తహసిల్దార్ పి.మురళి తెలిపారు. మంజూరైన దుకాణాలు కొండపిలోని స్థానిక హై స్కూల్ గ్రౌండ్స్ ఆవరణలో దీపావళి మందులు విక్రయించుకొనుటకు అవకాశం కల్పించామన్నారు. దుకాణదారులు దుకాణాల వద్ద ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా సరైన వసతులు కల్పించాలని తెలిపారు. నిబంధనలను ధిక్కరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమ్మ రైతులు సూచనలు పాటించాలి


చిన్న ముప్పళ్లపాడులో నిమ్మ తోటలను పరిశీలిస్తున్న హెచ్ఓ

హనుమంతునిపాడు: పండ్ల తోటల సాగు చేసే రైతులు ఉద్యానవన శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని హెచ్ఓ అంజలీబాయి అన్నారు. మండలంలోని చిన్నముప్పళ్లపాడులో సాగులో ఉన్న నిమ్మ, ఇతర ఉద్యానవన పంటలను మంగళవారం పరిశీలించారు. మానుబంక, వేరు కుళ్లు, ఎండు పుల్ల, పల్లాకు, కాయకు మంగు, ఆకు ముడత తెగుళ్ల ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు రైతులకు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు సూచించారు. వీఏఏ దేవిరెడ్డి శారద, రైతులు పాల్గొన్నారు.

కలుపు మొక్కల కలవరం


మిరపలో కలుపు తీస్తున్న కూలీలు


వరి పంటను తలపిస్తున్న మిరప చేలోని కలుపు మొక్కలు

- మిరపలో కలవరపెడుతున్న కలుపు మొక్కలు
- భారీ వర్షాలతో ఏపుగా పెరిగిన కలుపు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- పెరిగిన పెట్టుబడులు

మర్రిపూడి:

నియోజకవర్గంలో మిరప పంట సాగుచేసిన రైతులకు కలుపు మొక్కలు కలవర పెడుతున్నాయి. ఈ ఏడాది మిరప సాగుచేపట్టిన రైతులకు కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అకాల వర్షాలకు చాలా ప్రాంతాల్లో నష్టం వాటిల్లింది. తాజాగా కలుపు మొక్కలు కలవరపెడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఓ పక్క కలుపు, మరో పక్క కూలీల కొరతతో మిరప సాగుకు వరుసగా కష్టాలు వెంటాడుతున్నాయి.

పెరిగిన పెట్టుబడులు..

ఈ ఏడాది నియోజకవర్గంలో సుమారు 5వేల హెక్టార్లలో మిరప సాగు చేశారు. నర్సరావుపేట, బాపట్ల, వినుకొండ తదితర ప్రాంతాల్లో డబుల్ టూ రకం మిరప విత్తనాలు 10 గ్రాములు రూ. 800 నుంచి రూ. 1000 చెల్లించి కొనుగోలు చేశారు. మరి కొందరు రైతులు నర్సరీల్లో ఒక్కో మొక్క రూ.2 చొప్పున కొనుగోలు చేసి నాటుకున్నారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రైతుల పాలిట శాపంగా మారింది. మొక్కల యాత మొదలు వాయుగుండం ప్రభావతంతో ఎడతెరిపి లేకుండా సుమారు 15 రోజులు పాటు వర్షాలు కురిశాయి. దీంతో మిరప చేలల్లో విపరీతంగా కలుపు మొక్కలు పెరిగిపోయాయి. చేలకు కలుపు మందు కొట్టినా అదుపులోనికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. మిరప మొక్కల కంటే కలుపే దాదాపు ఒకటిన్నర అడుగుల ఎత్తు పెరిగిందంటున్నారు. భారీ వర్షాలకు చేలల్లో నీరు పెద్ద ఎత్తున నిలవడంతో కలుపు తీసేందుకు కూలీలు చేలల్లోకి దిగే వీల్లేకుండా పోయింది. గత రెండు రోజుల నుంచి కలుపుతీత పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్.

దాదాపు 15 నుంచి 20 రోజుల వర్షాలు కురిశాయి. ఇప్పుడే వర్షాలు పూర్తిగా తగ్గడంతో రైతులు కలుపు తీత పనులను ముమ్మరం చేశారు. ఒక్కసారిగా కలుపుతీత తీయాల్సి రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. మిరప పనులకు అత్యధికంగా మహిళా కూలీలను తీసుకెళుతున్నారు. కూలీకి రూ.500 ఇచ్చుకున్నా కూలీలు దొరకడంలేదని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.1.50 లక్షల పెట్టుబడి

నియోజకవర్గంలో పొన్నలూరు, మర్రిపూడి, కొండపి, జరుగుమల్లి మండలాల్లో అత్యధికంగా మిరప సాగుచేపట్టారు. పొలం కౌలు, దుక్కిదున్నడం,


కలుపు అనంతరం మిరప చేలో ఎద్దులతో సైద్యం చేస్తున్న రైతు

సైద్యాలు చేయడం, యాతకు ముందు బలంమందు, కోతకూలీ అన్నీ కలుపుకుని ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడి, కూలీలకు పోనూ కన్నీరే మిగులుతుందేమోనని రైతులువాపోతున్నారు. అధికారులు స్పందించి కలుపు మందు సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లు, కలుపు నివారణపై దృష్టి సారించాలి


చింతలపాలెంలో కందిపంటను పరిశీలిస్తున్న ఏఓ రాధ


హనుమంతునిపాడు: పొలంబడిలో మాట్లాడుతున్న ఏఓ రమణ


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ, ఏఓ

పామూరు: సాగులో ఉన్న పంటల్లో తెగుళ్లు, కలుపు నివారణపై రైతులు దృష్టిసారించాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని చింతలపాలెం, బోడవాడ రైతుసేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, మినుము పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మినుములో 30 రోజులలోపు కలుపు నివారణకు ఇమజాత ఫైర్ 400 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయుటం వల్ల ఆకుజాతి, గడ్డిజాతి కలుపును నివారించవచ్చన్నారు. ఉద్యానవనశాఖాధికారి కె.కుసుమ, వీఏఏలు వినయ్, రమ్య, ఏహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: పంటలు సాగు చేసిన రైతులు స్వల్ప మొత్తంలో చెల్లించి పంటలకు బీమా సౌకర్యం పొందాలని ఏఓ కె.రమణ అన్నారు. మండలంలోని లింగంగుంట్ల, వేములపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు స్వల్ప మొత్తంలో చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. హెచ్ఓ ఎం.అంజలీబాయి, వీఏఏలు ఏడుకొండలు, లక్ష్మీ భారతి రైతులు పాల్గొన్నారు.

కొండపి: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి కె.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు, చిన్న వెంకన్నపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. సబ్సిడీ శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వెటర్నరీ డాక్టర్ పేరయ్య మాట్లాడుతూ పశువులకు బీమా పథకం కింద రూ.398 చెల్లిస్తే మూడేళ్లకు రూ.30 వేలు బీమా వర్తిస్తుందన్నారు.

మర్రిపూడి: వేరుకుళ్ల తెగులు పట్ల కంది రైతులు అప్రమత్తగా ఉండాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ అన్నారు. మండలంలోని గార్లపేట, వేమవరం గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో కంది పంటకు వేరుకుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. వేరుకుళ్లుకు నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ ఆనాల వెంకట్రావు, మార్కెట్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ స్వామి, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: రాయితీ శనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత తెలిపారు. మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు ప్రవీణ్య, విస్తరణ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ అధికారి వసంత, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): రైతులు వరి, కందిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని కొండబోయినపల్లి, చింతలపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ బి.సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వరిలో ఆకుముడత, కాండంతొలుచుపురుగు, అగ్గి తెగులు నివారణపై, కందిలో ఎండుతెగులు, వెర్రి తెగులు యాజమాన్యం పద్ధతులు, మినుములో విత్తనశుద్ధి, కలుపునివారణపై వివరించారు. ఎంహెచ్ఓ కె.కుసుమ, పశువైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే.మునీర్, ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏ ఎం వెంకటరెడ్డి, వి.శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి పి.జ్యోత్స్నాదేవి అన్నారు. మండలంలోని పోలవరం, చిన ఇర్లపాడు రైతు సేవాకేంద్రాల్లోని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోందిలో భాగంగా కంది, వరి పంటలను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏఓ పి.జ్యోత్స్నాదేవి మాట్లాడుతూ వరిలో కాలిబాటలు తీసుకోవాలని, దీనివల్ల గాలి వెలుతురు సోకి దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. కంది పంటలో వెర్రి తెగులు సోకిన మొక్కలు కన్పిస్తే వెంటనే తీసివేయాలన్నారు. సర్పంచ్‌లు ముద్దా దానమ్మ, వీఏఏ షబానా, సరస్వతి, ఏహెచ్‌ఏలు శివ, హబీబ్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కనిగిరి రూరల్: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్స్ సొంతభవనాలు కేటాయించాలని, మెస్ చార్జీలు రూ. 3వేలకు పెంచాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ శివ శేషవర్ధన్‌రెడ్డికి అందచేశారు. ఎస్ఎఫ్ఐ తాలూకా కార్యదర్శి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఎస్‌జీఎఫ్ పోటీల్లో పట్టణంలోని చింతల పాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 26,27,28 తేదీల్లో తెనాలిలో జరిగిన అండ్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో (బాల, బాలికల) క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతల పాలెం విద్యార్థులు బాలికల విభాగంలో కె.దీక్షిత, (9వ తరగతి) ఎం లక్ష్మీ ప్రసన్న (7వ తరగతి), బాలుర విభాగంలో పి.నాగబాబు (8వ తరగతి) ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం కేవీ రామశర్మ, కేవీ వెంకటేశ్వర్లు, పీడీ శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీల్లో హాజరుశాతం పెంచాలి


మాట్లాడుతున్న సీడీపీఓ సరోజిని

పామూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించి పిల్లల హాజరుశాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజిని అన్నారు. మండలంలోని బొట్లగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అధ్యక్షతన సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భగా సీడీపీఓ మాట్లాడుతూ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ ఇవ్వాలన్నారు.

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తాం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచిలక రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 224 కు సంబంధించి ఎంజాయ్మెంట్ సర్వేపై స్థానిక సచివాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు హాజరైన తహసీల్దార్ మంజునాథరెడ్డి సర్వేనంబర్ 224కు సంబంధించి రైతులు, గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించి రికార్డులతో సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సాగు, రికార్డుల పరంగా అన్ని పరిశీలించి నిజమైన అర్హులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ రఫి, బత్తుల రమణయ్య, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వల్లూరమ్మ ఆలయం వద్ద టంగుటూరు వైపు వెళ్లే హైవేపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా.. ఓ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి సుమారు 40 ఏళ్లు ఉండవచ్చు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అంచనాలు తయారు చేయాలి

టంగుటూరు: ప్రతి గ్రామానికి 50 ఇంకుడు గుంతలకు అంచనాలు తయారు చేయాలని డ్వామా ఏపీడీ వెంకట స్వామి అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో టంగుటూరు, కొండపి మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఏ విధంగా పనులు కల్పించి, పనులు ఎలా నిర్వహించాలి, మస్టర్ నిర్వహణ, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామానికి ఒక ఫారం పాండు, రూఫ్ వాటర్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతలకు పని అంచనాలు వెంటనే తయారు చేయాలన్నారు. గోకులం షెడ్లకు సంబంధించి పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కెపాసిటి బిల్డింగు ఏపీడీ సుబ్బారావు, ఎంపీడీఓ దేవసేన కుమారి, డ్వామా కోర్సు డైరెక్టర్ లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై పేరు తొలగించడం హేయమైన చర్య

కనిగిరి రూరల్: విజయవాడలో ప్రతిష్టాత్మకంగా గత ప్రభుత్వంలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతి వనం విగ్రహంపై ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు తొలగించడం హేయమైన చర్య అని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. దళితుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న అధికార పార్టీ వైఖరిని తీవ్రంగా తప్పు పట్టారు. దళితుల ఆత్మగౌరవమైన అంబేడ్కర్ పేరుని తొలగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

టంగుటూరు: క్షేత్రస్థాయిలో బాలల హక్కులను పరిరక్షించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ విద్యాలయాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత జూనియర్ కళాశాలను సందర్శించి అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రగతి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ, స్టాక్ పరిశీలించారు. అనంతరం బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి అక్కడ స్థితిగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినుద్దేశించి మాట్లాడుతూ దగ్గర బంధువుల నుండే బాలికలకు ప్రమాదం ఎదురవుతుందని, అందు వల్ల మీకు మీరే రక్షణ ఏర్పరచుకోవాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులకు చనువు ఇవ్వకూడదని సూచనలు చేశారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెంచు పున్నయ్య, తన్నీరు బాలాజీ, ఎంపీడీఓ దేవసేన కుమారి, ఆర్ఐ హనుమంతరావు, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సిబ్బంది వీరాంజనేయులు, అనిత న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తాం


జెడ్ మేకపాడులో అర్జీ స్వీకరిస్తున్న డీటీ వెంకటేశ్వరరావు


ముప్పళ్లపాడులో గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ

పొన్నలూరు: రెవెన్యూ గ్రామసభల ద్వారా గ్రామాల్లోని రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని రీ సర్వే డీటీ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని జెడ్ మేకపాడులో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల భూ సమస్యలపై రైతులు 142 అర్జీలు సమర్పించారు. అనంతరం డీటీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూ విస్తీర్ణంలో తేడాలు, ఉమ్మడి ఎల్‌పీఎంలు, పేర్లు మార్పులు వంటి వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసయ్య, సర్వేయర్ రమేష్ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని ముప్పళ్లపాడులో తహసీల్దార్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభకు 42 అర్జీలు వచ్చినట్లు డీటీ కె.కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రీ సర్వేలో కొన్ని పొరపాట్లు, తప్పిదాలు జరిగాయని ప్రజల నుంచి అర్జీలు వచ్చాయి. సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్ఓ పరుశురాం, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

భైరవకోన హుండీ ఆదాయం రూ.4.80 లక్షలు


భైరవకోనలో హుండీ నగదు లెక్కిస్తున్న ఈఓ, సిబ్బంది, అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోన ఆలయ ప్రాంగణంలో మంగళవారం భైరవకోన హుండీ లెక్కింపు దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. గత 7 నెలలకు సంబంధించి హుండీ లెక్కించగా రూ.4,80,294 ఆదాయం వచ్చినట్లు ఈఓ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. లెక్కింపులో ఎం వెంకటరాజు, జె.కుమార్, ఆర్.రాజేంద్ర, ఎం రాజేంద్ర, ఎంసీ వెంకట్రామయ్య, అర్చకబృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు భూసార పరీక్ష పత్రాల పంపిణీ


భూసార పత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని చతుకుపాడులో రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని చతుకుపాడు, పచ్చావ గ్రామాల్లో వ్యవసాయం, అనుబంధ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. సర్పంచ్ ఎస్తేరమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి సుజయ్, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, సింగరాయకొండ సహాయ సంచాలకులు నిర్మలాకుమారి, ఉద్యాన శాఖాధికారి ప్రత్యూష, పశు వైద్యాధికారి శ్రావణి, జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు వెంకటరావు, విస్తరణాధికారులు జహీర్, జరుగుమల్లి వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నవ్య పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్


పిచ్చి చెట్లను తీయిస్తున్న చైర్మన గఫార్

కనిగిరి రూరల్: సమస్య, పరిష్కారం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ గఫార్ మంగళవారం పర్యటించారు. స్థానికులు విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, మురికి నీటి కాలువలు, నీటి సమస్య తదితర అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ చర్యగా 2వ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, 20వ వార్డులో సాగర్ ట్యాంక్ వీధిలో చిల్లచెట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

– సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీస్తే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తున్న జోనల్ సైన్స్‌ఫేర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ప్రారంభించారు. ×ఫ్యూచర్ ఆన్ 2024–25 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించి మంగళవారం ముగింపు సందర్భంగా మంత్రి స్వామి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సైన్స్‌ఫేర్‌లలో పాల్గొనడం ద్వారా శాస్త్రీయ దృక్పథం పెరిగి భయం తొలగి వ్యక్తిత్వ వికాసం వస్తుందన్నారు. విద్యార్థి దశలోనే అన్ని విధాలా మనో వికాసం సాధించాలని వారిలో స్ఫూర్తి నింపారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో 61 మంది పాల్గొనగా 20 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అనంతరం స్వామి వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్ గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లా కో ఆర్డినేటర్లు కె.పద్మజ, జయలక్ష్మి, జయ, ఎంపీడీఓ రామాంజనేయులు తహసీల్దార్ మురళి, ప్రిన్సిపాల్ అరుణ తదితరులు పాల్గొన్నారు

శిక్షణ తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జరుగుమల్లి (సింగరాయకొండ): ఆత్మ సౌజన్యంతో గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులకు డీపీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు రైతాంగానికి సూచనలు చేశారు. డీపీఎం సుభాషిణి, వ్యవసాయాధికారి యుగంధర్ రెడ్డి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి సుజయ్కుమార్, భూసార పరీక్షా కేంద్రం ఒంగోలు సహాయ సంచాలకురాలు సుచరిత, సింగరాయకొండ సహాయ సంచాలకురాలు నిర్మల కుమారి, ఉద్యాన శాఖాధికారి ప్రత్యూష, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం కేసు నమోదు

సింగరాయకొండ: మండలంలోని స్థానిక మలినేని సుశీలమ్మ మహిళా కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న అలేఖ్య అదృశ్యమైనట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. తిరుపతి జిల్లా మంగళంపాడు గ్రామానికి చెందిన అలేఖ్య దసరా సెలవులు ముగించుకొని కళాశాల హాస్టల్‌కు వచ్చినట్లు తెలిపారు. అనంతరం మంగళవారం ఉదయం 8 గంటలకు కాలేజీ నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, చుట్టుపక్కల వెతకినా కనిపించకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.